


# గోడు

మన్నెం శారద




శర్మద భర్త రావుగారు చనిపోయేరన్న వార్త నాకు చెప్పలేని షాక్ కల్గించింది. వెంటనే వెళ్లి శర్మదని చూడా లనిపించినా నేను ఇండియాకి తిరిగి రాలేని స్థితిలో ఉన్నాను. అయిదు సంవత్సరాల బాండ్ ఉండటంతో నేను చికాగో వదలడానికి వీల్లేక, ఆ దుర్వార్తని జీర్ణించుకోలేక చాలా అవస్థపడ్డాను. నా స్నేహితురాలు ఆనందలక్ష్మి రాసిన ఉత్తరాన్ని ఎన్నోసార్లు నిస్తేజంగా చదువుకున్నాను. ఆ వార్త మెదడులోకి ఎక్కే కొద్దీ గుండె భారమైపోసాగింది.

నేను, శర్మద, ఆనంద చిన్ననాటి నుండి కలిసి చదువుకున్నాం. మా అందరిలోకి శర్మద చాల సున్నిత మనస్కురాలు. ప్రతి చిన్న విషయానికి ఎంతగానో చలించిపోయేది. ఆనంద దీనికి పూర్తి వ్యతిరేకం. దేన్నీ సీరియస్‌గా తీసుకునేది కాదు. తన గమ్యాన్ని చేరే ప్రయత్నంలో ఎలాంటి అవాంతరం ఎదురైనా దూసుకుపోయే తత్వం. ఇంటర్ తర్వాత మా చదువులు వేర్వేరు దారి పట్టినా ఒకే ఊళ్లో ఉండటం వలన మా స్నేహాలు మాత్రం చెక్కు చెదరలేదు. నేను ఎమ్‌సెట్‌లో రాంక్ సాధించి మెడిసిన్‌లో చేరాను. ఆనంద బి.ఎస్సీలో, శర్మద బి.ఎస్సీ హోమ్ సైన్స్‌లోనూ చేరారు. నా ఎం.డి. అయ్యే లోపున ఆనంద పిహెచ్‌డి పూర్తి చేసి ఆంధ్రా యూనివర్సిటీలోనే ఉద్యోగం సంపాదించుకుంది. శర్మద మాత్రం డిగ్రీ కాగానే ఒక ప్రముఖ దినపత్రికలో పనిచేస్తున్న జర్నలిస్టు రావుగార్ని ప్రేమించి పెళ్లి చేసుకుంది. కులాంతరం కావడంతో శర్మద ఇంట్లో ఎవరూ ఆ పెళ్లికి వెళ్లలేదు. నేను, ఆనంద మాత్రం పెళ్లికి వెళ్లాం. రావుగారికి, శర్మదకి వయసులో దరిదాపు పదేళ్ల తేడా ఉంటుంది. శర్మద అందం ముందు రావుగారు చాలా సామాన్యంగా ఉంటా రనిపిస్తుంది. అసలు వీళ్లిద్దరికీ ఎలా కలిసింది అని ఆశ్చర్యపోయాం మేము.

ఆ మాట అడిగితే శర్మద నవ్వి "ప్రతి రోజూ పేపర్లో ఆయన రాసే వ్యాసాలు చదివేదాన్ని. చాలా ఉత్తేజితంగా అనిపించేవి. ఆయన తెలివితేటలు, ఆలోచించే విధానం న న్నాయన వైపు ఆకర్షింపచేశాయి. వెంటనే పరిచయం చేసుకున్నాను. ఆ పరిచయమే...."

"ప్రణయానికి దారి తీసిందంటావు!" అంటూ మధ్యలోనే అందుకుని చమత్కరించిది ఆనంద.

బదులుగా సిగ్గుపడి తలదించుకుంది శర్మద.

"అందర్నీ ఎదిరించి చేసుకున్నావు. చాలా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందేమో!" అనడిగే న్నేను సందేహంగా.

"వటవృక్షం క్రింద చేరాను, కలువు మొక్కలత పనేమిటి?" అంది శర్మద గర్వంగా.

"ఏయ్! అందులో మమ్మల్ని కూడ కలిపేస్తున్నావా కొంపదీసి?" అంది ఆనంద కోపం నటిస్తూ.

"ఛ! కులం, మతం అంటూ ఏడ్చేవాళ్ల గురించి. అద్సరే, పెళ్లయిపోయిన దాన్నని నను ఎడంగా పెట్టక ఎప్పటిలా మా ఇంటి కొస్తారు కదూ!" అని మా చేతులు గట్టిగ పట్టుకుంది శర్మద.

"తప్పకుండా వస్తాం. నువ్వు మా ఆయన, మా ఆయనంటూ ఆయన నుత్తి కొట్టి మా మెదళ్లు తినకపోతే!" అంది ఆనంద.

"ఛ! అలా ఎప్పుడూ చేయను. ఆయన స్థానం ఆయనదే! మీ స్థానాలు మీవే!" అంది శర్మద చెమర్చిన కళ్లతో.

మేం వీడ్కోలు తీనుకుని వచ్చేశాము.

మా నాన్నగారికి నా ఎం.డి. పూర్తి కాకుండానే ఒరిస్సాలోని బరంపురం బదిలీ అయింది. నన్ను హాస్టల్లో ఉంచడమా, లేక గాజువాకలో ఉన్న మా దూరపు బంధువు లింట్లో ఉంచడమా అని ఆలోచిస్తుండగా శర్మద అనుకోకుండా మా ఇంటి కొచ్చి "వర్షని మా ఇంట్లో అట్టిపెట్టుకుంటాను. మా ఇల్లు విశాలంగానే ఉంటుంది. ఆయన 'ఇన్వెస్టిగేషన్సం'టూ నెలలో వదిహేను రోజులు ఊళ్లు పట్టుకు తిరుగుతుంటారు. నాకు తోడుగా ఉంటుంది" అనడిగింది మా నాన్నగారిని.

నాన్నగారి క్కూడా శర్మద చిన్నప్పటి నుండీ తెలుసు. శర్మద ప్రవర్తన పట్ల, వినయ విధేయతల పట్ల మా ఇంట్లో సదభిప్రాయ ముంది. ఆమె వివాహం పట్ల కూడా మా నాన్నగారు ప్రోత్సాహకరంగానే మాట్లాడారు. పైగా నా కాలేజికి, హాస్పిటల్‌కి గాజువాక చాలా దూరం కావడంతో శర్మద ఇంట్లో న న్నుంచడానికి నాన్నగా రంగీకరించారు.

నేను వెంటనే వాళ్లింటికి మారిపోయాను.


అప్పుడే రావుగారితో నాకు బాగా స్నేహం కుదిరింది.

శర్మద, రావుగారు చాలా అన్యోన్యంగా ఉండేవారు. 'దాంపత్య మంటే అలా ఉండాలి' అని నాకు చాలసార్లనిపించేది. పెళ్లి కాగానే కొన్నాళ్లు సినిమా థియేటర్ల వెంట, పార్కుల వెంట స్కూటర్లెక్కి భర్త నడుముకి చేతులు చుట్టి తిరగడంలో అసలైన ప్రేమ ఉండదని - ఒకర్నొకరు అర్థం చేసుకుని - ఒకరి ఆలోచనల్ని మరొకరు గౌరవించుకుంటూ ఒకరి ఆశయాల్ని మరొకరు ప్రోత్సహిస్తూ ఒకర్నొకరు గుర్తించుకోవడంలోనే అసలైన ప్రేమ ఉందనే విషయం వాళ్లిద్దర్నీ చూస్తే బాగా అర్థమైంది నాకు.

రావుగారు రాసిన వ్యాసాలు, వార్తా వ్యాఖ్యలు మొదట శర్మదే చదివి వాటిని సునిశితంగా విమర్శించేది. బాగుంటే పొగిడి "ఈ ఆర్టికల్ మీరు కాక మరెవరింత బాగా రాయగలరు!" అని ప్రోత్సహించేది. వాటిని ఓపిగ్గా టైప్ చేసి పెట్టేది. ఆయన కూడా శర్మద విషయాల్ని అతి శ్రద్ధగా పట్టించుకునేవారు. శర్మద అభిరుచుల్ని గౌరవించడమేకాక - ఏ ఊరెళ్లినా ఆమె ఇష్టపడే హేండిక్రాఫ్ట్ ఏదో ఒకటి తెచ్చి పెట్టేవారు. ఇద్దరూ కలిసి ఆదివారం వస్తే ఉమ్మడిగా ఇల్లు దులుపుకుని శుభ్రం చేసుకుని అందంగా ఇంటిని తీర్చిదిద్దుకునేవారు. సెలవు రోజున రావుగారు శర్మద ఎంత మొత్తుకున్నా వినకుండా ఆమెను పక్కకు నెట్టి వంట చేసేవారు.

"మీ వంటతో వర్ష కేమన్నా అయితే వాళ్ల నాన్నగారికి నేను జవాబు చెప్పుకోవాలి! వర్ష ఉన్నన్ని రోజులయినా మీరు వంట జోలికి రాకండి!" అనేది శర్మద.

"ఏమ్మా? నా వంట నిజంగా బాగుండదా?" ఆయన నా వైపు చూసి అడగ్గానే "నిజం చెబితే ఏమీ అనుకోరుగా!" అన్నా న్నేను సందేహంగా ఆ భార్యాభర్తల్ని చూస్తూ.




"చెప్పవే ఛండాలంగా ఉంటుందని. అప్పుడయినా ఈ గరిట తిప్పుడు వ్యవహారం వదిలేస్తారు" అంది శర్మద నా భుజమ్మీద పొడుస్తూ.

"నలుడు, భీముడు వంటలో చాల గొప్పవాళ్లంటారు. కాని వాళ్ల వాళ్ల పాక శాస్త్ర ప్రావీణ్యం గురించి నాకు తెలియదు. మీరు మాత్రం మా శర్మద కన్నా వంద రెట్లు బ్రహ్మాండంగా వంట చేస్తారు. నిజం చెప్పాలంటే ఆదివారం కోసం నేను చచ్చేట్లు ఎదురుచూస్తాను" అన్నా న్నేను.

నా జవాబు పూర్తయిందో, లేదో శర్మద నా నెత్తిన గట్టిగా మొట్టి "విశ్వాస ఘాతకురాలా! వారంలో ఆర్రోజులు నా వంట తింటూ ఆయన్ని పొగుడుతున్నావా?" అంది కోపం నటిస్తూ.

"ఉన్నమాట చెప్పింది. అలా ఉడుక్కోవట మెందుకు?" అన్నారు రావుగారు నవ్వుతూ.

శర్మద కూడా మాతో శ్రుతి కలిపి నవ్వుతూ "నిజమేనే! ఆయనేం చేసినా అద్భుతంగా చేస్తారు. నే నెంత ప్రయత్నించినా ఆయనలా చెయ్యలేను" అంది.

నాకు నిజమే ననిపించేది.

ఎప్పటికప్పుడూ ఏదో రాసుకుంటూ - చదువుకుంటూ అర్ధరాత్రి వరకు మెలకువగా ఉన్నా తెల్లవారుజామున అయిదు గంటలకే ఠంఛనుగా నిద్రలేచి శర్మదని తీసుకుని వాకింగ్‌కి వెళ్లేవారు.

"సముద్రం ఈ రోజెంత బాగుంద నమ్మాయీ! ఎందుకో తెగ ఉత్సాహంగా గెంతుతోంది!" అని చెప్పేవారు నాకు.

"పాపం, మీలానే అర్థం లేకుండా అవస్థపడుతోంది!" అనేది శర్మద వెక్కిరింపుగా.

ఆయన పరిచయం, కలుపుగోలుతనం నన్ను బాగా ఆయనకి దగ్గర చేశాయి. నాకు అన్నయ్య లేని లోటు ఆయన తీర్చినట్లు భావించసాగాను.

అప్పుడప్పుడు ఎక్కడెక్కడికో వెళ్లేవారు. శ్రీకాకుళంలోని మారుమూల ఏజెన్సీల కెళ్లి కల్లు గీతగాడిలా తాడిచెట్టెక్కి ఆయన నక్సలైట్ల కార్యకలాపాల ఫోటోలు తీసుకొచ్చినప్పుడు శర్మద నిజంగానే భయపడి ఏడ్చేసింది.

"వద్దండీ! ఇంత సీరియస్‌గా మీరు వృత్తిలో లీనమైతే చాలా సమస్య లొస్తాయి. ప్రాణానికే ముప్పు రావచ్చు" అంది బాధగా.

"అవునండీ! ఎందుకింత రిస్కు తీసుకుంటున్నారు! మీ కేమైనా అయితే శర్మద గతి!" అన్నా న్నేను కూడా జోక్యం చేసుకుంటూ.

మా మాటల కాయన తేలిగ్గా నవ్వేసి "నేను, శర్మద కలిసి ఒక్కసారి పుట్టలేదు, ఒక్కసారే చచ్చిపోవడానికి. అయినా ప్రతిక్షణం చావు గురించి ఆలోచిస్తే ఏదీ చెయ్యలేం. ఏమీ సాధించలేం. ఏ డైనమిక్ జర్నలిజం చూసి నాకు దగ్గరయ్యేవో - అ దిప్పుడు వద్దంటే ఎలా? ప్రజ ల్నెవరు చైతన్యవంతుల్ని చేస్తారు?" అన్నా రాయన.

శర్మద మరింక మాట్లాడలేదు.

ఆయన శర్మదకి ఇంటీరియర్ డెకరేషన్ నేర్పించారు.


నా ఎం.డి., అయిపోగానే నాకు విదేశాలకు వెళ్లే అవకాశం వచ్చింది. అమెరికాకు బయలుదేరుతున్నప్పుడు వాళ్లిద్దరూ, ఆనంద కూడా బొంబాయిదాకా వచ్చి విమాన మెక్కించారు.

నేను చికాగో వచ్చి నా పనిలో నిమగ్నమైపోయాను. 'బెస్ట్ జర్నలిస్ట్'గా రావుగారికి బంగారు పతకం వచ్చిందనీ ఉత్తరం రాసింది శర్మ దొకసారి. ఈలోపున ఆనంద వివాహం కూడా జరిగిపోయింది.

మరో సంవత్సరంతో నా కోర్సు పూర్తయి నేను ఇండియా వెళ్తాననుకునేలోపున ఈ ఘోరం జరిగిపోయింది. ఈ విపత్తుని శర్మద ఎలా ఎదుర్కోగలదు? రావుగారు లేని శర్మద జీవిత మెలా ఉంటుంది? అసలు శర్మద బతకగలదా? శర్మదని ఎవ రూరడించగలరు! ఎన్నో జవాబు దొరకని ప్రశ్నలతో నా తల బద్దలైపోయేది.

శర్మద గురించి ఆలోచిస్తూనే మిగతా సంవత్సరాన్ని ముగించాను.

ఇండియా బయలుదేరుతుంటే నాకు సంతోషమే లేదు. నా తల్లిదండ్రుల్ని కలుసుకోబోతున్నానన్న ఆనందాన్ని శర్మదకి




జరిగిన అన్యాయం పూర్తిగా మింగేసింది.

దుఃఖ భారంతోనే బొంబాయి చేరుకున్నాను. నాన్నగారు ఎయిర్‌పోర్టుకి వచ్చారు. ఆయన రిటైర్ కావడంతో ఇప్పుడు తిరిగి వైజాగ్‌లోనే స్థిరపడ్డారు. ఆయన ఇంటి విషయాలు చెబుతుంటే పరధ్యానంగా వింటున్నాను. అమ్మకి లో-బి.పి. అని, తమ్ముడు వ్యాపారంలో బాగా సెటిలయ్యాడని, నా కో సంబంధం వచ్చిందని - ఇలా ఈ అయిదేళ్లుగా ఇంట్లో జరిగిన మార్పులన్నీ ఆయన వివరిస్తుంటే వైజాగ్ చేరుకున్నాం. అమ్మ నన్ను కావలించుకుని కంట తడిపెట్టుకుంది. ఎన్నాళ్లకొక నన్ను చూడగలిగినందుకు ఆమెలో ఆనందం కట్టలు తెంచుకుంది. నే నెంత చెప్పినా వినకుండా రకరకాల వంటలు చేసింది.

"ఏం చదువులో కాని, సరైన తిండి లేక ఎలా పాడైపోయావో తెలుసా?" అంది కొసరి కొసరి వడ్డిస్తూ.

"నీ కళ్ల కలా కనిపిస్తుందేమో గాని, నాకు స్మార్ట్‌గా బాగానే ఉందమ్మా!" అన్నాడు తమ్ముడు నవ్వుతూ.

"నీ మొహం నీ కేం తెలుసు, అందం సంగతి! ఆడపిల్లలు బూరెల్లా, బంతుల్లా ఉంటే అందం కాని, అప్పడాల్లా, తడకల్లా కాదు ఉండాల్సింది!" అంది అమ్మ చిరుకోపంగా.

"నువ్వు చెప్పినట్లుండాలని దానికి ఒక్కసారే వడ్డించకు, అజీర్తి చేస్తుంది!" అన్నారు నాన్న నవ్వుతూ.

భోజనాలు ముగిశాక కాసేపు పడుకున్నాను. కాని, నిద్ర మాత్రం పట్టలేదు. ఎందుకో మనసు ఒకరకమైన ఉద్వేగానికి లోనవుతోంది. శర్మద ఎలా ఉందో! ఆ సంగతి అడిగితే ఏం వినాల్సి వస్తుందోనని - ఇందాక భోజనాల దగ్గర గట్టిగా నిగ్రహించుకున్నాను.

సాయంత్రం మూడు గంటలకి అమ్మ టీ ఇస్తూండగా మెల్లిగా ఆ సంగతి కదిపాను -

"శర్మదని చూశావామ్మా?"

నా ప్రశ్నకి అమ్మ మొహం నిరసనగా మారింది.

"మనం చూసేంత దీన స్థితిలో లేదులే నీ శర్మద!" అంది హేళనగా.

"అంటే?"

"చెబితే ఏం తెలుస్తుంది, వెళ్లి చూడు! నీ కసలు ఎపాయింట్‌మెంట్ దొరుకుతుందో, లేదో అసలు! మొగుడు చస్తే గాని ముత్తయిదువవి కాదందట వెనకటి కెవర్తో!" అంటూ నే టీ తాగిన కప్పు తీసుకెళ్లి పోయింది అమ్మ విసురుగా.

అమ్మ మాటకి నా మనస్సు చివుక్కుమంది.

ఆవిడకి వయసు పెరిగింది. పైగా లో-బీ.పీ. ఆ విసురుకి కొంత అనారోగ్యం కారణం కావచ్చని మనసుని సరిపుచ్చుకుని మొహం కడుక్కుని తయారై ఆనంద ఇంటికి బయలుదేరాను.

నేను వెళ్లేసరికి ఆనంద ఇంట్లోనే ఉంది.

ఎవరిమీదో గట్టిగా కేకలేస్తోంది.

నన్ను చూసి చిరునవ్వు తెచ్చుకుని, "రా, రా! ఎప్పుడొచ్చావు? ఈ మధ్య మీ నాన్నగారు కనిపించారు కాని, నీ వొస్తున్న సంగతి చెప్పనేలేదు!" అంది డ్రాయింగ్ రూమ్‌లోకి దారి తీస్తూ.



## తప్పులు

"ఒక చిన్న ఉత్తరంలో ఇన్ని తప్పు లెందుకున్నాయి?"

"మీరు రాసిచ్చిన ఉత్తరం చూసే టైప్ చేశాను."

చాగాపురం నాగేశ్వరరావు [గద్వాల్]

"పెద్ద వయసు కదా, మరచిపోయుంటారు. అద్సరే, పెళ్లయింది కదా! పిల్లలా ఏమన్నా?" అని అడిగాను కూర్చుంటూ.

"అదొక్కటే తక్కువ! ఆయనే పిల్లాడిలా ఏడిపిస్తూంటారు. టైముకి నిద్ర లేవరు. ఏ పనీ తనంతట తాను చేసుకోలేరు. అంతా స్పూన్ ఫీడింగే! చంపేస్తున్నారనుకో!" అంది విసుగ్గా.

వెంటనే నాకు రావుగారు గుర్తొచ్చారు.

ఆయన పని చాతుర్యం, తెలివి, కలుపుగోలుతనం - అన్నీ నేనే మరిచిలేకపోతున్నాను. శర్మద ఎలా మరచిపోగలదు? అమ్మెందుకు శర్మద గురించి అంత నిష్ఠూరంగా మాట్లాడింది!

ఆ సంగతే అడుగుదా మనుకునేంతలో "ఆనందా!" అంటూ లోపల్నుండి ఒక మగ గొంతు వినిపించింది.

"ఇప్పుడే వస్తా! ఆయన్ని పంపించేస్తే శని విరగడవుతుంది!" అంటూ పరుగెత్తినట్లు లోనికెళ్లింది ఆనంద.

భర్త నప్పుడే శని దేవతలా భావిస్తోంది ఆనంద. అంటే వీళ్ల సంసారంలో చిటపట లప్పుడే ప్రారంభమయ్యా యన్నమాట.

'కమిట్‌మెంట్, కన్సర్న్, కమ్యూనికేషన్' - భార్యాభర్తల మధ్య లేకపోతే ఆ సంసారం నవ్యంగా నడవదంటుండేవారు రావుగారు. అందుకే ఆయన శర్మద నంత అపురూపంగా చూసుకునేవారేమో!

"ఏమి టాలోచిస్తున్నావు?" అంటూ కాఫీ కప్పులతో ప్రత్యక్షమైంది ఆనంద.

"మీ వారి సేవలయ్యాయా?"

"ఆ! సాగనంపడం కూడా జరిగింది. రాత్రి ఏ పదకొండు గంటలకో పునర్దర్శన మవుతుంది, తిరిగి. ఇక నీ సంగతులు చెప్పు!" అంది ఒక కప్పు నా కందిస్తూ.

"అంత రాత్రివరకూ పనుంటుందా?" అన్నాను ఆశ్చర్యంగా కాఫీ కప్పు అందుకుంటూ.

"ఆఁ! ఉండకేం చేస్తుందీ! పీకల వరకు తాగితే బార్లలో! స న్నడిగితే సారా నిషేధం అంటూ లేబర్ క్లాస్ గురించే అరిచి గోలచేస్తున్నారు గాని, ఈ బార్లని మూస్తే గాని మధ్య తరగతి కుటుంబాలు బాగుపడవు. మనం రోడ్లమీద కెక్కనూ లేం, సులువుగా విడాకులు తీసుకోనూ లేము. ఈయనవల్ల బి.పీ. పెరిగి నే సరపని రోజు లేదు. చుట్టుపక్కలవాళ్ల కీయన చేసే పనులు తెలియవు. అందరూ నాకు 'గయ్యాళి' అన్న బిరుదిచ్చేశారు" అంది తన బాధని నవ్వుల్గా మార్చుకుంటూ ఆనంద.

ఆనంద జీవితం ఆనందంగా లేదని నాకు వెంటనే అర్థమయింది.

పెళ్లి గురించి ఏమాత్రం సరైన అవగాహన లేనివాళ్ల సంసారాలు ఇలానే ఉంటాయనిపించింది నాకు.

ఆనంద మనసు మళ్లించాలనే ఉద్దేశ్యంతో "శర్మద దగ్గర కెళ్దాం, వస్తావా?" అనడిగాను.

ఆ పేరు వినగానే మా అమ్మలానే ఆనంద మొహ కవళికలు అప్రసన్నంగా మారిపోయాయి.

"శర్మద మన కిప్పు డెక్కడ దొరుకుతుంది, తను చాలా బిజీ!" అంది ఆనంద కొంత వెటకారం మిళితం చేసిన గొంతుతో.

"అంటే?"

"అంటే ఏముంది? ఆయన బతికుండగా ఈవిడకి ఇంటీరియర్ డెకరేషన్ నేర్పించాడుగా. ఆ పని చేస్తోంది మరొకతనితో కలిసి. ఇక హెూంసైన్స్ కదా! ఈస్టరన్ ఘాట్స్ అని ఒక మాడ్రన్ రెస్టారెంట్ నడువుతోంది. మనం వెళ్ళినా మాట్లాడే తీరికే ఉండ దావిడకి!" అంది ఆనంద.

ఆ మాట విని నేను నిజంగానే సంతోషించాను.

ఖాళీగా కూర్చుని రావుగారి గురించి దుఃఖిస్తూ జీవితాన్ని మరింత భారంగా చేసుకోకుండా రోజంతా పని కల్పించుకోవడం ఎంతో మంచిదని అనుకున్నాను.

"ఫోన్ చెయ్యి, నే నొచ్చానని!" అన్నా న్నేను ఉత్సాహంగా.

"ఆ మహాతల్లి ఇప్పు డెక్కడుంటుందో!" అని సణుక్కుంటూ, ఆనంద 'ఇన్నర్ బ్యూటీ' పేరుతో నడుస్తున్న ఇంటీరియర్ డెకరేషన్ షోరూమ్‌కి ఫోన్ చేసింది. శర్మద అప్పుడే అక్కణ్నుంచి వెళ్లిందన్న సంగతి రిసెప్షనిస్ట్ చెప్పగానే 'ఈస్టరన్ ఘాట్స్'కి ఫోన్ చేసింది.

"నువ్వొండుతున్న క్రేబ్స్ కర్రీ వాస నిక్కడ కొస్తున్నది గానీ, వర్ష వచ్చింది స్టేట్స్ నుండి! నీ కోసం కలవరిస్తుంటే, నువ్వు బిజీ అని తెలిసి కూడా ఫోన్ చేశాను. సారీ ఫర్ ద డిస్టర్బెన్స్!" అంది ఆనంద.

"ఏడ్చావు గాని, రిసీవర్ వర్ష చేతికివ్వు!" అంది శర్మద.

"మాట్లాడమ్మా మహాతల్లితో!" అంటూ రిసీవర్ నా చేతికిచ్చింది ఆనంద.

నా గొంతు వినగానే, "హాయ్, శర్మా! ఎప్పుడొచ్చావే? ఎలా ఉన్నావ్? ఎన్నిరోజులయిందే నిన్ను చూసి! వెంటనే ఇక్కడ కొచ్చేయ్!" అంది ఆత్రుతగా.

నా గొంతు వినగానే శర్మద రావుగారి గురించి బాధపడుతుందని, ఆమె నెలా ఓదార్చాలా అని అనుకున్న నేను శర్మద అన లేమీ జరగనట్లు సంతోషంగా మాట్లాడటంతో నిజంగా హతాశురాలి నయ్యాను. రిసీవర్ పెట్టేస్తూ ఆనంద వైపు నీరసంగా చూశాను.

నా నీరసంలోని భావాన్ని పసిగట్టి, "అప్పుడే ఏమైంది, అక్కడి 'కెళ్లి చూడు!" అంది వెటకారంగా.


నేను ఆటోలో ఆనంద చెప్పిన గుర్తుల ప్రకారం బీచ్‌రోడ్డులో ఉన్న ఈస్టరన్ ఘాట్స్ రెస్టారెంట్‌కి వెళ్లాను. రెస్టారెంట్‌ని చాలా కళాత్మకంగా తీర్చిదిద్దింది శర్మద. చైనీస్ స్టయిల్లో ఉన్న చిన్న చిన్న కాటేజ్‌లు, వాటి మధ్య క్రోటన్స్, వాటికి దాపులో టెర్రకోట బొమ్మలు, కేన్ ఫర్నీచర్‌తో చాలా అందంగా ఉంది రెస్టారెంట్. ఆటో దిగగానే ఒక స్టువార్డు వచ్చి ఆటో మీటర్ రీడింగ్ చెల్లించి నన్ను లోపలికి తీసుకెళ్లాడు. వంట గదిలో వేడి వేడి స్టౌల దగ్గర నానా హైరానా పడిపోతూ నిలబడి వంట చేస్తోంది శర్మద.

నిజానికి శర్మదని నేను గుర్తుపట్టలేకపోయాను.

ఖాదీ ప్రింట్స్ చుడీదార్‌తో, బాబ్డ్ హేర్‌తో చాలా విభిన్నంగా ఉంది శర్మద.

నన్ను చూడగానే గరిట వదిలి గట్టిగా కౌగలించుకుంది. ఆ ప్రేమలో మాత్రం నటన కనిపించలేదు నాకు.

అక్కడున్న వర్కర్సందరినీ పిలిచి, "ఈవి డెవరనుకుంటున్నారు? నా ప్రాణ స్నేహితురాలు.




చిన్నప్పటినుంచి ఒకే ప్రాణంగా కలిసి బతికాము" అంటూ పరిచయం చేసింది.

నాకు వెంటనే ఆ వంట గదిలోనే ఒక కుర్చీ వేయించి, మంచినీళ్లిచ్చి వద్దన్నా ఒక కూల్ డ్రింక్ తెప్పించి ఇచ్చింది.

వంట చేస్తూనే నా క్షేమ సమాచారాలు, అమెరికా విశేషాలూ అడిగింది. ఇంటీరియర్ డెకరేషన్‌లో తను సంపాదించిన ప్రావీణ్యం, తన కంపెనీకి ఉన్న డిమాండ్ చెప్పింది. రెస్టారెంట్‌లో ఉన్న అవస్థలు, ఆ వృత్తిలో తనకున్న సంతృప్తి గురించీ చెప్పింది. ఎన్ని మాటలు చెప్పినా ఆమె రావుగారి టాపిక్ ఏ విధంగానూ ఎత్తకపోవడం నాకు చాలా ఆశ్చర్యాన్ని బాధను కలిగించాయి. రావుగా రామెను భార్యగానే కాకుండా, ఒక స్నేహితురాలిలా, కొన్ని సందర్భాల్లో బిడ్డలా కూడా చూసుకున్నారు. ఆ లాలింపుని, ప్రేమని, గుర్తింపుని శర్మద ఇంత తొందరగా ఎలా మరచిపోయింది. శర్మద నిజంగానే ఒక



**రాజీనామా!**

"నే నొక చిన్న రాజకీయ నాయకుణ్ని నే నేం సాయం చేయగలను?"

"రాజీనామా" అన్నారు ప్రజలు.

చాగాపురం నాగేశ్వరరావు [గద్వాల]

మెటీరియలిస్టా!

నా ఆలోచనల్ని గుర్తించనట్లుగా శర్మద తాను స్వయంగా వండిన భోజనం నాకు పెట్టింది. అవన్నీ నిజంగా చాలా రుచిగా ఉన్నాయి. అయినా నా మనసు చేదుగా ఉండటం వలన వాటి రుచి నాకు గొప్పగా అనిపించలేదు. అక్కడ పని అయ్యాక శర్మద మా ఇంటికి డయల్ చేసి, "రేపొస్తానని చెప్పు! ఈ రాత్రి నాతోనే ఉందువుగాని. చాలా కబుర్లు చెప్పుకోవచ్చు!" అంది.

నేను మనస్సులో అయిష్టంగా ఉన్నా శర్మద చెప్పినట్లుగానే ఇంటికి ఫోను చేసి చెప్పాను.

ఇద్దరం కలిసి శర్మద కారులో వాళ్లింటికి చేరుకున్నాం. గేటు తీయగానే శర్మద కొత్తగా పెంచుతున్న పామరిన్ కుక్కపిల్ల బొచ్చు నిక్కపొడుచుకుని గారంగా చూస్తూ, రెండు కాళ్లెత్తి శర్మదని ఎత్తుకోమని గొడవ చేసింది. శర్మద దాన్ని ప్రేమగా ఎత్తుకుని, "దీనికి నేనంటే చచ్చేంత ప్రేమ! ఇన్ని గంటలూ ఏం తినకుండా కూర్చుంటుంది. ఒక్క నిముషం కూర్చో!" అంటూ దానికి పాలు, అన్నం కలిపి పెట్టి స్నానం చేసి బట్టలు మార్చుకుని వచ్చింది.

ఈలోపున శర్మద ఇంటి వాతావరణాన్ని పరిశీలిస్తూ కూర్చున్నా న్నేను. రావుగా రుండగా వేసిన మొక్కలు పూలు పూస్తున్నాయి. తోట ఇంకా బాగా పెంచినట్లు అనిపించింది. ఇల్లు కూడా అందంగా, కళాత్మకంగా పెట్టుకుంది. కాని ఎక్కడా రావుగారి ఫోటో మాత్రం నాకు కనిపించలేదు.


చాలా అసంతృప్తిగా ఉంది నాకు.


శర్మద నాతోపాటే పడుకుని తన హెూటల్ మేనేజ్‌మెంట్ గురించి, పనివాళ్లలో నిజాయితీ లేకపోవడం గురించి, మొదట పెట్టినప్పుడు తను పడ్డ అవస్థల గురించి చాలా చెప్పి, నా పెళ్లి గురించి అడిగింది.

నేను ఆనంద గురించి చెప్పి, "మీ ఇద్దరినీ చూస్తుంటే నాకు పెళ్లి చేసుకోవాలనిపించడంలేదు!" అన్నాను నిర్లిప్తత నిండిన ధోరణిలో.

శర్మద అదోలా నవ్వి, "సిల్లీ! నీకలా

[తరువాయి 48వ పేజీలో]




జరుగుందని ఎందుకనుకోవాలి? ఆనంద భర్త మంచివాడే. ఆనంద అత స్సనలు పట్టించుకోకుండా డబ్బు మనిషిగా తయారవడంతో అత డలా అయ్యాడు. భర్తంటే డబ్బు ముద్రించే యంత్ర మనుకుంటే ఎలా?'' అంది.

'మరి నీ నంగతేమిటి? భర్త పోగానే మరిచిపోవడమేనా? అత నిచ్చిన మధుర స్మృతుల్ని తుడిచేయడమేనా?' అని అడగాలనిపించినా ఎందుకో అడగలేకపోయాను.

చాలాసేపు మాట్లాడుకుంటూనే నిద్రలోకి జారుకున్నాను.

***    ****    ***    ***

అర్ధరాత్రి ఎందుకో ఎవరో లేపినట్లు మెలకువ వచ్చింది నాకు. అన లెక్కడున్నానో తెలియక చుట్టూ చూశాను. కాసేపటికి నేను ఇండియా వచ్చిన నంగతి, శర్మద ఇంట్లో ఉన్న విషయం నంగతి గుర్తొచ్చాయి.

పక్కన చూశాను. శర్మద లేదు.

అరె! రాత్రి నా పక్కనే పడుకుందే, ఏమైంది?

ఎక్కడో శర్మద ఎవరితోనో మాట్లాడుతున్న శబ్దం వినిపించి, అనలు నంగతి తెలునుకోవాలని హాల్లోకి వచ్చాను. అతవల గది తలుపులు దగ్గరగా వేసి ఉన్నాయి.

నేను తలువు దగ్గరగా వెళ్లి నిలబడి చెవొగ్గి ఆనక్తిగా వినసాగాను.

శర్మద నన్నగా ఏడుస్తున్న నవ్వడి!

"నా కీ రోజు ఆయ నెంత గుర్తున్తున్నారో తెలుసా! అన లెప్పుడాయన్ని మరచిపోయాను కనుక! 'మనం ఒక్కసారి పుట్టలేదు. ఒక్కసారి చచ్చిపోం. నా కేమైనా నువ్వు ధైర్యంగా బతకాల'ని ఆయన మరీ మరీ చెప్పబట్టి ఈ బతుకు బతుకుతున్నాను. ఈ రోజాయనుంటే వర్ధని చూసి ఎంత నంతోషపడేవా రనుకున్నావ్! వర్ధంటే చెల్లెలి ప్రేమాయనకి. నిన్ను కూడా చూస్తే వదిలేవారు కాదు! నాకన్నా బాగా చూనుకునేవారు. ఆయన ఒడిలో కూచునే అదృష్టం నీకు లేకపోయింది. ఆయన నీడలో బతికే అదృష్టం నాకు లేకపోయింది. ఎన్నాళ్లిలా బతకాలి చెప్పు? ఆయన్ని మరచిపోవడాని కెన్ని పనులు చేసినా మరచిపోలేకపోతున్నాను!''


శర్మద వెక్కిక్కి ఏడున్తూంటే నేను తలుపులు తోనుకుని లోపలి కెళ్లాను.

అంతసేపూ శర్మద ఒడిలో కూర్చుని శర్మద బాధను చెవులు రిక్కించుకుని వింటున్న కుక్కపిల్ల ఆమె ఒడిలోనుంచి కిందకు దూకి కుయ్ కుయ్‌మంది.

శర్మద కళ్లు తుడుచుకుని నవ్వడానికి ప్రయత్నిస్తూ, "నిద్ర పట్టలేదా? ఇ దెందుకో అరుస్తూంటే చూద్దామని వచ్చాను!'' అంది.

నేను బాధగా నవ్వి, "నీ కష్టాన్ని చెప్పుకోడానికి మనిషే దొరకలేదా, శర్మదా నీకు!'' అని అడిగాను.

శర్మద నిర్లిప్తంగా నవ్వింది.



## వాటి కెలా తెలుస్తుంది?

"సైన్స్ బాగా వృద్ధి చెందిన ఈ కాలంలో ఇంకా దయ్యా లేమిటి?'' మండిపడ్డా డో హేతువాది.

దానికి నాంచారయ్య - "సైన్స్ అభివృద్ధి చెందిందని దయ్యాల కెలా తెలుస్తుంది, చెప్పండి!'' అన్నాడు.

చందు [మద్రాసు]

"రావుగారు పోయిన కొత్తలో నాకు ప్రపంచమంతా చీకటైపోయింది. భరించలేకపోయాను. ఎవరు చూడటానికొచ్చినా ఆయన నంగతే మాట్లాడేదాన్ని. ఆయన గురించే బాధపడేదాన్ని. కొన్నాళ్లకు అందరూ నా దగ్గరకు రావడం మానేశారు. చాటుగా హేళన చేయడం గమనించాను. చిరాకుపడటం తెలిసింది.

"బాగా దగ్గర స్నేహితురాలు అని ఆనంద దగ్గరికి వెళ్తే ఆనంద బాహాటంగానే చిరాకుపడింది. నన్ను తప్పించుకు తిరిగింది. చివరికి నా కర్థమైంది ఒకటే - ఈ మనుషులు మన నంతోషాన్ని పంచుకోగలరు కాని బాధ లెంతమాత్రమూ భరించలేరన్న విషయం! అప్పుడే ఈ కుక్కని పెంచడం మొదలుపెట్టాను. ఇది ఇన్ని ఎంగిలి మెతుకులు పెట్టినపుణ్యానికి నా వెంట తోక ఊపుతూ ప్రేమగా తిరుగుతుంది. నే చెప్పే నంగతులు దానికి వినుగు కలిగించినా ఏదైనా అనడానికి దానికి నోరు లేదు. కళ్లార్పకుండా నే చెప్పేవి వింటుంది. అందుకే ఎవరూ లేని అర్ధరాత్రులు దానికి నా గోడు వెళ్లబోసుకుంటాను. అది నన్ను కించపరచదు. చిన్నబుచ్చదు.''

శర్మద జవాబు విని ఖ్రాన్పడిపోయాను నేను.

"శర్మా!'' అన్నాను ఆమె చేతులు పట్టుకుని దిగ్భ్రమగా.

శర్మద వేడి కన్నీళ్లు నా చేతుల మీద జారి పడ్డాయి.

"అవును, వర్ధా! నవ్వినా, ఏడ్చినా కన్నీళ్లే వస్తాయన్నా డొక మహాకవి. ఈ మనుషులు కష్టాలు చెప్పినా హేళన చేస్తారు. సుఖంగా ఉన్నా దుయ్యబడతారు. నాకు తెలును, నే నిలా వేషం మార్చి నంతోషంగా ఉన్నట్లుగా కనబడటం కూడా చాలామంది నహించలేకపోతున్నారని! కాని నేను చనిపోయేటప్పుడు రావుగారు చెప్పిన విధానాన్నే పాటిస్తున్నాను. 'నీ దుఃఖా న్నెవరితోనూ పంచుకోడానికి ప్రయత్నించకు. నిన్ను మరింత కుంగదీస్తుం దీ నమాజం!' అని. ఇప్పుడు చెప్పు, నాలో ఏమైనా తప్పుందంటావా?''

శర్మద ప్రశ్నకి నా కన్నీళ్లే జవాబయ్యాయి. ●